# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు.**
2. **సైబర్ నేరాలతో పాటు గంజాయి నిర్మూలనను సవాలుగా తీసుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీసులకు పిలుపునిచ్చారు.**
3. **ఎన్డీఏ కూటమి నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేస్తామని భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు.**
4. **కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజాహితంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.**
5. **రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో ఈరోజు నుంచి నూతన మోటారు వాహన చట్టం అమల్లోకి రానుంది.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు. గంగాధర నెల్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్దిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం పది సూత్రాలలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అలాగే, ప్రజా వేదిక సభ నుంచి స్థానిక ప్రజల్ని ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడనున్నారు.

--------------------------

సైబర్ నేరాలతో పాటు గంజాయి నిర్మూలనను సవాలుగా తీసుకోవాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీసులకు పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజి మైదానంలో ఈరోజు జరిగిన సబ్ ఇన్ స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో కలిసి హోం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 394 మంది ఎస్సైలు శిక్షణ పూర్తి చేసుకోగా అందులో 97 మంది మహిళలు ఉండడం గర్వకారణమన్నారు. నేరం చేసిన 100 రోజుల్లోగా నేరస్తులకు శిక్షపడేలా పోలీసులు పనిచేయాలని మంత్రి తెలుపుతూ...

వాయిస్: 36 సెకన్లు

--------------------------

ఎన్డీఏ కూటమి నాయకత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేస్తామని భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని బంగారుపేటలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొని... అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నెల 3వేల కోట్ల రూపాయలకు పైగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. అలాగే రాబోయే 5సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం పాటుపడుతుందని మంత్రి తెలిపారు.

---------------------------

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజాహితంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బడ్జెట్ పై ఆమె నిన్న మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖలకు ప్రాధాన్యత ఇచ్చారని, బీజేపి శాసనసభ్యులు బడ్జెట్ చర్చల్లో పాల్గొని ప్రజా సమస్యలను వినిపిస్తారని ఆమె తెలుపుతూ...

...వాయిస్ ... 23 సెకన్లు

---------------------------

రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో ఈరోజు నుంచి నూతన మోటారు వాహన చట్టం అమల్లోకి రానుంది. ఈ చట్టంతో జరిమానాలు భారీగా పెరగనున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తూ హెల్మెట్ లేకపోతే వెయ్యి జరిమానా, బైక్ వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోయినా వెయ్యి జరిమానా చెల్లించాలి. డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే 5 వేల రూపాయలు జరిమానా, వాహనానికి బీమా లేకుంటే వెయ్యి, రెండోసారి దొరికితే 2 వేలు, శబ్దం, పొగ కాలుష్యానికి కారణమైతే 2 వేల నుంచి 4 వేల రూపాయలు జరిమానా విధిస్తారు. కాబట్టి ప్రజలందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అలాగే అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఈరోజు నుంచి ఈనెల 20వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని చంద్రబాబు ఆకాంక్షించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు సజావుగా రాయాలని మంత్రి లోకేశ్ కోరారు. వేసవి దృష్ట్యా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని... డీహైడ్రేషన్‌కు గురికాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే విధంగా బడ్జెట్ ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నీటిపారుదలశాఖకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని ఆయన తెలిపారు. 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి చేసి, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు గోదావరి జలాలు ప్రవహించేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవాకు పెద్ద పీట వేస్తూ నిధుల కేటాయింపులు జరిగాయని ఆయన తెలియజేస్తూ..

..వాయిస్ ..34 సెకన్లు

---------------------------

రాష్ట్ర రాజధాని అమరావతి స్వీయ ఆర్థిక ప్రాజెక్టు అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అమరావతిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. అమరావతికి ఎక్కడా కూడా ప్రభుత్వం నుంచి అదనంగా ఖర్చు పెట్టడం లేదని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు, హడ్కో రుణాలు ఇచ్చాయని తెలిపారు. ఇప్పటికే 48వేల కోట్ల రూపాయల మేర పనులకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ముగియగానే ఈనెల 10వ తేదీన టెండర్లు తెరుస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో 820 కోట్ల రూపాయలు కేటాయించిందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కె.పట్టాభిరాం అన్నారు. విజన్ 2047 కోసం రూపొందించిన పది సూత్రాలలో స్వచ్ఛ ఆంధ్రకు భాగం కల్పించడం ద్వారా స్వచ్ఛతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగిస్తామని పట్టాభిరామ్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 18 సెకన్లు....

---------------------------

రైతులను ప్రకృతి సాగుకు ప్రోత్సహించి, వారికి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భీమవరంలో నిన్న జరిగిన ప్రకృతి సాగుకు ముందస్తు ప్రణాళికపై.. జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడని ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించాలన్నారు. 2024-25 సంవత్సరంలో 13 వేల ఎకరాలలో ప్రకృతి పంటల సాగు చేయగా, ఈ సంవత్సరం 50 వేల ఎకరాల సాగు లక్ష్యంగా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందన్నారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చిన్న.. మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే మంజూరు చేయాలన్నారు.

=====================